నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 30 అక్టోబర్ 2024 | SIDDIPET

మెదక్‌లో కేసీఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 29: వినియోగదారులపై చార్జీల భారం మోపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్లి పెంచకుండా కృషి చేసినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మెదక్ బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించుకున్నారు. అనంతరం కేసీఆర్, పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లి కార్జున్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 10 నెలల కాలంలోనే 18,500 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు ప్రతిపాదనలు చేసిందన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. తమ వాదనలను విద్యుత్ నియంత్రణ మండలి గుర్తించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందన్నారు. పెంపు ప్రతిపాదనలను తిరస్కరించిన విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుంకయ్య, కిశోర్, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, సోహైల్, సాధిక్, బీఆర్ఎస్ నాయకులు గడ్డమీది కృష్ణాగౌడ్, సంగ శ్రీకాంత్, కిరణ్, చాంద్‌పాషా, జయరాంరెడ్డి, కండెల సాయిలు తదితర నాయకులు పాల్గొన్నారు.

వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు

వర్చువల్ ప్రారంభంలో పాల్గొన్న మంత్రులు

అమీన్‌పూర్, అక్టోబర్ 29:ఆయుష్మాన్ భారత్ పీఎం జెన్ ఆరోగ్యయోజన కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్క్ సహజానంద్ మెడికల్ టెక్నాలజీ ప్రైవేట్ సంస్థలో ఇంటర్నెట్ వేదికగా వర్చువల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, టీజీఐఐ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సహజానంద్ మెడికల్ టెక్నాలజీ ఎండీ ఎస్‌హెచ్.ధీరజ్ లాల్ కోటాడియా, పరిశ్రమల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కొనుగోళ్ల కోలాహలం..

దీపావళి పండుగకు ముందు వచ్చే ధన్ త్రయోదశి రోజున ధంతేరస్‌ను నిర్వహించుకుంటారు. దీనికోసం మంగళవారం సిద్దిపేటలో మహిళలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారు. బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సంగారెడ్డి పట్టణంలోనూ పండుగ సందడి కనిపించింది. మహిళలు దివాళి సామగ్రి కొనుగోలులో బిజీగా కనిపించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపించింది.
– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్స్, సిద్దిపేట/సంగారెడ్డి, అక్టోబర్ 29

సబ్ సెంటర్లు అందుబాటులోకి వచ్చేనా..

మిరుదొడ్డిలో పూర్తయిన ఆరోగ్య ఉపకేంద్రం

వీరారెడ్డిపల్లిలో అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రం

మిరుదొడ్డి, అక్టోబర్ 27: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించడానికి బీఆర్ఎస్ హయాంలో రెండేండ్ల క్రితం నిర్మించతలపెట్టిన ఆరోగ్య ఉప కేంద్రాలు ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఉమ్మడి మండలంలోని మిరుదొడ్డి మండల కేంద్రం, అల్వాల, మల్లుపల్లి, ధర్మారం, వీరారెడ్డిపల్లి, ఖాజీపూర్, భూంపల్లి, అక్బర్‌పేట, రుద్రారం గ్రామాల్లో ఒక్కో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ం) ద్వారా రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. 9 సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ.2.80 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. కానీ, సకాలంలో సబ్ సెంటర్ల పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల రోగులు మిరుదొడ్డి టౌన్, భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. మిరుదొడ్డిలో సబ్ సెంటర్ పనులు పూర్తయినా అందుబాటులోకి తేవడం లేదు. మిగతా చోట్ల త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు, ఫుట్‌బోర్డులో నిలబడిన విద్యార్థులు

అమ్మో..ఆర్టీసీ ప్రయాణం

- ఆర్టీసీ ప్రయాణంపై పెదవి విరుస్తున్న పురుషులు
- బస్సు రాగానే ఎగబడుతున్న ప్రయాణికులు
- సీటు దొరకడం గగనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పరిమితికి మంచి ప్రయాణంతో ప్రమాదాలు

ప్రజ్ఞాపూర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సులో నిలబడి ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు

గజ్వేల్, అక్టోబర్ 29: ఆర్టీసీ బస్సులో ప్రయాణం అంటే నరకప్రాయంగా మారింది. ఒకప్పుడు సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామాగా నిలిచింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక మహాలక్ష్మి పథకం ప్రారంభించడంతో ప్రయాణానికి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. సామాన్య ప్రజానీకం దూరప్రాంతాలకు వెళ్లాలంటే ప్రధానంగా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారు. ఎంత దూరమైనా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అన్నివిధాలుగా అనుకూలంగా భావిస్తారు. కానీ, మహాలక్ష్మి పథకం అమలు తర్వాత మహిళా ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. పరిమితికి మించి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. సీట్లు దొరకడం గగనంగా మారింది. బస్సు ఏ డిపో నుంచి ప్రారంభమవుతుందో అక్కడే పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇక ముందుకు వెళ్లేకొద్దీ స్టేజీల వద్ద బస్సు ఆగినప్పుడు ఎక్కే ప్రయాణికులు ఎంత దూరమైన నిలబడి ప్రయాణం చేయాల్సి వస్తున్నది. నిత్యం ఆర్టీసీ బస్సులో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రతి బస్సులో 90శాతం వరకు మహిళలే ప్రయాణిస్తున్నారు. ఉదయం సమయంలో ఉద్యోగులు, దూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వాళ్లు ప్రయాణం చేయాలంటే విసుగుకుంటూ ఇదేమి ఉచిత బస్సు ప్రయాణం అం టూ పెదవి విరుస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంలో తెలంగాణలోని మహిళలందరినీ అర్హులుగా ప్రభుత్వం ప్రకటించడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ఇక సెలవు దినాలు, పండుగ రోజుల్లో ఏ బస్సు చూసినా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నది. పరిమితికి మించి బస్సులో ప్రయాణికులు ఎక్కుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లోడ్ భరించక ఇప్పటికే పలుచోట్ల బస్సు టైర్లు ఊడిపోయిన ఘటనలు జరిగాయి. అంతే కాకుండా బస్సుల నిర్వహణ పట్టించుకోక పోవడంతో కండీషన్ లేక ఎక్కడపడితే అక్కడ బస్సులు ఆగిపోతున్నాయి.

ఏ బస్సు చూసినా...

ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద ఉదయం, సాయంత్రం సమయంలో వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ఆర్టీసీ బస్సులు ఎక్కువ సంఖ్యలో రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రతి బస్సు అక్కడి నుంచే ఫుల్‌గా వస్తుంది. అదే విధంగా భువనగిరి వెళ్లే బస్సుల్లో అదే పరిస్థితి కనిపిస్తున్నది. మహిళలు ఎక్కువగా దేవాలయాలకు వెళ్తుతున్నారు. ఆదివారం కొమురవెల్లి, నాచారం, యాదాద్రి, స్వర్ణగిరికి వెళ్తున్నారు. తిరుగు ప్రయాణంలో ప్రతిఒక్కరూ బస్సులో సీటు దొరక్క అలసిపోతూ కనిపిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ప్రతి బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కడంతో కండక్టర్‌కు తలనొప్పిగా మారుతున్నది. డ్రైవర్‌లు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు హైదరాబాద్‌కు సిద్దిపేట, వేములవాడ, మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల, దుబ్బాక, హుస్నాబాద్, పెద్దపల్లి, ఆసిఫాబాద్, ఉట్నూర్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ నుంచి వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎన్ని ట్రిప్పులు తిరిగినా ప్రయాణికులకు మాత్రం సీటు దొరకడం పెద్ద సవాల్‌గానే మారింది. మహాలక్ష్మి పథకంలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం, ఆర్టీసీ గొప్పలకు పోతున్నది. కానీ, పండుగలు, ప్రత్యేక రోజుల్లో స్పెషల్ బస్సుల పేరిట రోజువారీగా నడిచే బస్సులనే తిప్పుడూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రద్దీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడికి, కళాశాలకు వెళ్లడానికి బస్సులు ఫుల్‌గా వస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బస్సుల్లో ప్రయాణికులు ఎక్కువ కావడంతో కొన్ని స్టేజీల వద్ద ఆపకుండానే వెళ్తుండడంతో విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. దీనిపై పలుచోట్ల విద్యార్థులు ఆందోళనలు సైతం చేస్తున్నారు.

చేర్యాల దవాఖాన సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 29: నాలుగు మండలాల ప్రజలకు దిక్కున్న చేర్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం దవాఖానకు ఆయన సందర్శించి అన్ని వార్డులు, ల్యాబ్, ఎక్స్‌రే డిపార్ట్‌మెంట్, ఫార్మసీ, పీఐపీ యూనిట్ తదితర వాటిని పరిశీలించి సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దవాఖానలో పని చేస్తున్న వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో మాతాశిశు మరణాల రేటు తగ్గించామని, దేశంలోనే ఉత్తమ వైద్యసేవలు తెలంగాణలో అందుతున్నాయనే స్థాయికి తీసుకుపోయినట్లు తెలిపారు. తల్లీపిల్లల సంక్షేమం కోసం కేసీఆర్ కిట్, పిల్లల కోసం న్యూట్రిషియన్ కిట్, ఆడబిడ్డ పుడితే రూ.13వేలు,మగబిడ్డ పుడితే రూ.12వేలు, గర్భిణులకు అమ్మఒడి ద్వారా అత్యుత్తమ సేవలు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక వైద్యసేవలు సక్రమంగా అందడం లేదన్నారు. అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు కావడం లేదన్నారు.బీఆర్ఎస్ హయాంలో చేర్యాల దవాఖానకు నూతన భవనం మంజూరు చేసిందని, నూతన భవనం నిర్మా ణం 80శాతం మేరకు పనులు పూర్తి అయినట్లు తెలిపారు. దవాఖానలో ఓపీ చూసే ప్రదేశంలో స్లాబ్ పెచ్చులూడుతున్నదని, ఇలాంటి వాతావరణంలో వైద్యులు ఏ విధంగా సేవలు అందిస్తారని ప్రశ్నించారు.ప్రభుత్వ దవాఖానలో స్త్రీ వైద్య నిపుణురాలు లేకపోవడం విడ్డూరంగా ఉందని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు రావడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వైద్యులను, సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకున్నానని, త్వరలో హెల్త్ మిని స్టర్‌తో పాటు హెల్త్ సెక్రటరీని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి చేర్యాల దవాఖానలో డిజిటల్ ఎక్స్‌రే, ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, బీఆర్ఎస్ టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మాజీఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్,యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలు, గదరాజు చందు, బీఆర్ఎస్ నాయకులు పెడుతల ఎల్లారెడ్డి,చొప్పరి సాగర్, గదరాజు యాదగిరి, బండమీది కరుణాకర్,యాట యా దగిరి, మంచాల కొండయ్య, తాడెం రంజితా కృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి, కోతి దాసు, తాండ్ర సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 29: సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా అబ్దుల్ హమీద్ నియమితులయ్యారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. హైదరాబాద్‌లోని ఎలక్షన్ సీఈవో కార్యాలయంలోని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో అబ్దుల్ హమీద్ పనిచేసి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాపై పూర్తిగా అవగాహన తెచ్చుకొని ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుకు కృషిచేస్తానని, జిల్లా అభివృద్ధికి తనవంతుగా పాటుపడతానని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు.

వీడియోకాన్ఫరెన్స్‌సంగారెడ్డి నుంచి పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు

సమగ్ర సర్వేకు విస్తృత ఏర్పాట్లు

దిశా నిర్దేశం చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 29: ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే లక్ష్యాలు, విధి విధానాలు, కార్యాచరణ గురించి వివరించారు. సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. సర్వే కోసం ఆయా బ్లాక్‌ల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను గుర్తించాలన్నారు. 2011 జనాభా గణన ప్రకారం ఎన్యుమరేషన్ బ్లాకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన కాలనీలను అప్‌డేట్ చేసుకోవాలని, 150 కుటుంబాలకు ఒకరు చొప్పున ఎన్యుమరేటర్లను నియమించాలని, 10 మంది ఎన్యుమరేటర్లకు ఒకరు చొప్పున సూపర్‌వైజర్లను నియమించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై ఇంటింటి సర్వే ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

- తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దు
- కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

పోతారం(ఎస్)లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 29: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని ఆర్‌కే జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 322 కేంద్రాల్లో వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని కోరారు. పత్తిలో తేమ శాతం 8లోపు ఉంటే మద్దతు ధర రూ.7500 లభిస్తుందని, రైతులు తొందరపడి తక్కువ ధరకు పత్తిని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా నాయకులు మద్దతుగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిల్లర్ల కేటాయింపులు జరుగలేదన్నారు. జీరో డ్యూటీ ఉండి ప్రభుత్వానికి మంచిగా చెల్లించిన వారికే కేటాయింపు చేస్తామని తెలిపారు. మిల్లర్ల కేటాయింపుతో పాటు 60–70శాతం మంచిగా చెల్లించిన వారికి 10శాతం బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చి అవకాశం కల్పిస్తున్నామన్నారు. డిఫాల్ట్ ఉన్న మిల్లర్లకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కేటాయించడం లేదని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాల చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకట్, సింగిల్ విండో అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్మన్ అయిలేని అనిత, సీసీఐ అధికారులు ఉన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

వీసీలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌రూరల్: వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 29: ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక, విద్యా కులగణన చరిత్రలో నిలిచిపోతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కులగణన సర్వేలో పాల్గొంటున్న అధికారులు గొప్ప అవకాశంగా భావిస్తున్నారన్నారు. ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను సిద్ధం చేయాలని, సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. సర్వేలో అధికారులందరూ సమన్వయంతో పనిచేసి దేశానికి రోల్‌మోడల్ నిలవాలన్నారు.